క్లుప్తంగా

సదస్సుకు తరలిన నాయకులు

నారాయణపేట టౌన్ : 'ఫాసిజం – ప్రమాదంలో భారతదేశం' అనే అంశంపై హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర సదస్సుకు జిల్లా కేంద్రం నుంచి శుక్రవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు ప్రత్యేక వాహనంలో తరలి వెళ్లారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి. రాము, పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, ప్రజాపంథా డివిజన్ నాయకులు యాదగిరి, నరసింహ, ప్రశాంత్, వెంకట్‌రాములు తదితరులు ఉన్నారు.

ఆలయానికి విరాళాలు

నర్వ: మండలంలోని బెక్కర్‌పల్లి గ్రామ ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో సీసీ బెడ్ నిర్మాణానికి దాతలు విరాళాలు అందించారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రూ. 50 వేలు, నర్వ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి రూ. 1లక్ష అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆలయ ఆవరణలో దాతలను శాలువాలతో సత్కరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు దండు అయ్యప్ప, గడ్డం నర్సిములు, డా.శంకర్, వడ్డె లింగన్న, శ్రీనువాసులు, బెక్కర్‌పల్లి గ్రామ సర్పంచు లక్ష్మీదేవమ్మ, గ్రామ పెద్దలు హన్మంతు, రాంరెడ్డి, వడ్ల నారాయణ, సుధాకర్, రవి, సుధాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ధన్వాడ: గోటూర్‌లో శుక్రవారం పోలీస్ కళాబృందం గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. అంటరానితనం, మూఢనమ్మకాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల ఏర్పడే అనర్థాలు, తదితర విషయలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది రాములు, సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నారాయణపేట రూరల్ : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కానిస్టేబుల్ తిరుపతి అన్నారు. ట్రాఫిక్ సిబ్బందితో కలిసి పట్టణంలోని శ్రీసత్యనారాయణస్వామి చౌరస్తాలో శుక్రవారం వాహనతనిఖీలు చేపట్టారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలను గుర్తించారు. వాటికి నంబర్ ప్లేట్ వేయించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని అందుకు వాహన యజమానులు, తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. ఇష్టారీతిగా పార్కింగ్ చేయరాదని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే జరిమానా కట్టాల్సి వస్తుందన్నారు. నెంబర్‌ప్లేట్ లేకపోతే వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆత్మకూర్: అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ పంపిణీ చేశారు. ఆత్మకూర్ పట్టణానికి చెందిన దొబ్బలి ప్రశాంతికి రూ.60 వేలు, పార్వతమ్మకు రూ.26 వేలు చెక్కులను కుటుంబసభ్యులకు అందజేశారు. మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా బాధితులకు న్యాయం చేకూరుతుందని వారన్నారు. కార్యక్రమంలో మండ్ల రామకృష్ణ, గడ్డమీది శ్రీను, మోసిన్, శ్రీధర్‌జ్యోషి, విజయ్, చందుగౌడ్ తదితరులు ఉన్నారు.

'జీఓ నంబర్ 317 రద్దు చేస్తాం'

అమరచింత: ఉపాధ్యాయుల సమస్యలు తెలిసిన గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థిగా గెలిపిస్తే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల శాసన మండలి అభ్యర్థిగా కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థికి మద్దతుగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఉపాధ్యాయులు తమ హక్కులను కోల్పోయారన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, అరుణ్‌కుమార్, జుబేర్, మహంకాళీ విష్ణు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో హెల్త్‌కేర్, బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, టూవీలర్స్ అంశాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నాగమణి, పాల్, జయమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు షకీల్‌అహ్మద్, లత, అంజలన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు మరువలేం


మక్తల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు



పేటలో మాట్లాడుతున్న ఓంఐఎఫ్ సభ్యులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమెచ చిత్రపటానికి ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులు అర్పించారు. స్టేట్ టీమ్ సభ్యులు ఎండీ జోష్, బిందే, రాణి, నారాయణ, నర్సింహులు, శ్రీనివాసులు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: మండలంలో జాతీయ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు కస్కప్ప, నర్సిములు, బాలకృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి శుక్రవారం నివాళి అర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం, బీఎస్పీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆంజనేయులు, శంకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని బీసీ సంఘం మండల అధ్యక్షులు సుధీర్ అన్నారు. సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా శుక్రవారం నర్వ బీసీ భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నర్వ బీసీ కమిటీ గ్రామ అధ్యక్షులు అయిలయ్య యాదవ్ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రతిభ విద్యానికేతన్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. కరస్పాండెంట్ మధుసూదన్, ప్రిన్సిపాల్ మహేశ్వరీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


నర్వలో..


మాగనూర్‌లో..


కోస్గిలో..

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి


మాట్లాడుతున్న వేణు కల్యాణ్

మాగనూర్(కృష్ణ): గూడెబల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణ, మాగనూర్, మక్తల్ మండలాల నుంచి దాదాపుగా 1500 మంది విద్యార్థులకు మోటివేషనల్ స్పీకర్ వేణు కల్యాణ్‌తో పరీక్షలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్ఎల్‌వి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణు కల్యాణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలన్నారు. వారికి పలు సూచనలు చేశారు. సర్పంచ్ మహాదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ...


పేటలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు


కంసాన్‌పల్లిలో..


వడ్వాట్‌లో..


గుండుమాల్‌లో..

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ఎయిడెడ్ వైదికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉదయకుమారి, రాహుల్, నాగేష్, రాధిక, అనిత, శిరీష, పద్మావతి, శివలీల పాల్గొన్నారు.

మక్తల్: మాద్వార్‌లో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ ఇందిర, హెచ్ఎం నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: నూతన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, బలభద్రాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: రెనివట్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం పాషా, ఉపాధ్యాయులు విజయశాంతి, రాములుగౌడ్, అనంతయ్య, యశ్వంత్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: కంసాన్‌పల్లిలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ గోవిందమ్మ, సర్పంచ్ గురునాథ్‌గౌడ్ ఎంపీటీసీ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: వడ్వాట్‌లో నిర్వహించిన వేడకల్లో మండల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్, సర్పంచ్ నర్సిములు, ఎస్ఎంసీ చైర్మన్ అంజప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


శంకర లింగేశ్వర స్వామి ఆలయం


స్వామివారి మూలవిరాట్

ఊట్కూర్ : తెలంగాణ, కర్ణాటక సరిహద్దు వాగుల సంగమంలో వెలసిన శంకర లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఊట్కూర్ మండలంలోని సమస్తాపూర్ వాగు, కర్ణాటక యాద్గీర్ జిల్లా ఇడ్లూర్ వాగుల సంగమ ప్రదేశంలో ఈ ఆలయం వెలసింది. దాదాపు 15 రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. శనివారం తెల్లవారు జామున అగ్నిగుండం, సాయంత్రం ప్రభాతోత్సవం, 12 ఆదివారం రథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఇక్కడ ఎద్దుల క్రయ, విక్రయాలు జోరుగా కొనసాగుతాయి. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఈ నేపథ్యంలోనే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సైదాపూర్, ఊట్కూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

శంకర లింగేశ్వర స్వామి ఆలయాన్ని జనమేజయుడనే రాజు నిర్మించినట్లు శాసనాలు ఉన్నాయి. సూర్యోదయ కిరణాలు నేరుగా స్వామివారి మూల విరాట్‌పై పడేవిధంగా ఆలయాన్ని నిర్మించారు. గుడిలో నల్లని రాతి శిల్పాలతో మండపాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వారికి ఎడమ వైపున నంది విగ్రహం, కుడి వైపున వీరభద్ర స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. నంది విగ్రహం నాసికా రంధ్రాల నుంచి జలం ధారగా వస్తుంది. ఆలయ సమీపంలోని ఉన్న రావివేప చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే దంపతులకు సంతానం భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.

కొనసాగుతున్న ప్రచారం

మాగనూర్(కృష్ణ): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రొఫెసర్ వినయ్ బాబుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ కున్సి, కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు జగదీష్ రామకృష్ణ, నవీన్, నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణపేట రూరల్ : పీఆర్‌టీయూ సంఘం ద్వారానే టీచర్ల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మద్దూర్, దామరగిద్ద, నారాయణపేటలోని పాఠశాలల్లో అసిఫాబాద్, నారాయణపేట జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఆడె ప్రకాష్, యాద్గీర్ జనార్దన్‌రెడ్డిలతో కలిసి అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల బాధలు పట్టని వ్యక్తుల కంటే సమస్యలను లేవనెత్తే గొంతుకను మండలికి పంపిద్దామని తపస్ జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి, కార్యదర్శి నర్సింహా అన్నారు. పట్టణంలోని సీఎస్ఆర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలు, మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఏవీఎన్ రెడ్డిని మండలికి పంపిస్తే తన గళంతో విద్యా వ్యవస్థలో మార్పుకు కృషిచేస్తారని అన్నారు. కేజీబీవీ టీచర్ల సమస్యల పరిస్కారానికి కృషిచేస్తామన్నారు.

పట్టణంలో ఫాగింగ్...

నారాయణపేట టౌన్ : పట్టణంలో దోమల నివారణ కోసం కమిషనర్ సునీత ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపల్ కార్మికులు ఫాగింగ్ చేపట్టారు. హజిఖాన్‌పేట, సింగార్‌బేస్, సాయివిజయ్ కాలనీ, సివిల్‌లైన్, బాపునగర్ కాలనీలలో ఫాగింగ్ చేపట్టేలా శానిటేషన్ సూపర్‌వైజర్లు చెన్నకేశవులు, శ్రీధర్ చర్యలు తీసుకున్నారు. మురుగు కాల్వలలో ప్లాస్టిక్ కవర్లు, వర్థ్యాలు వేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు ప్రజలకు సూచించారు.

విజయవంతంగా శస్త్రచికిత్స

నారాయణపేట రూరల్ : కర్ణాటక రాష్ట్రం యాద్గీర్ జిల్లా అన్‌పూర్ గ్రామానికి చెందిన 31 ఏళ్ల సంవత్సరాల వ్యక్తికి పట్టణంలోని సునంద ఆస్పత్రిలో తుంటిలో పెల్విస్ ఎముకకు ఆపరేషన్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో బాధితుడి కుడికాలు తుంటిలో పెల్విస్ ఎముక, మోకాలు చిప్ప విరిగిందని ఈ క్రమంలో తమను సంప్రదించగా 7 గంటల పాటు శ్రమించి విజయవంతంగా ఆపరేషన్ పూర్తిచేశామని వైద్యులు ప్రసాదొట్టి శుక్రవారం తెలిపారు. శస్త్ర చికిత్స చేయడం పట్ల పలువురు వైద్యులు, పట్టణ వాసులు అభినందించారు.

పాదయాత్ర భక్తులకు సన్మానం

నారాయణపేట రూరల్ : తిరుమల కొండకు ఏటా పాదయాత్రగా వెళ్తున్న భక్తులను సత్యసాయి సేవా సమితి సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పాదయాత్రగా ఏటా పాదయాత్రగా వెళ్తుండడానికి ఈ సారి 25 సంవత్సరాలు బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమాచారి చేతుల మీదుగా శాలువా కప్పి సత్కరించారు. అంతకుముందు భజనలు చేసి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ శాంతమ్మ ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద ప్రభుత్వం రూ.9 లక్షలను గ్రామానికి కేటాయించిందని పనులను త్వరగా పూర్తి చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఉపసర్పంచ్ చెన్నయ్య, వెంకటస్వామి, శ్రీరాజు, అనంతయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా తీలేర్ రహదారి


తీలేర్ పెద్ద చెరువుపై గుంతలుగా మారిన రోడ్డు

మరికల్: మండలంలోని తీలేర్ నుంచి వెంకటాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో అవస్థలు తప్పడం లేదంటున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా తీలేర్ దగ్గర చెరువు ఆనకట్టపై రోడ్డు గుంతలుగా మారడంతో అదుపు తప్పితే చెరువులో పడాల్సిందేనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఆకట్టుకున్న బాలమేళా


బాలమేళాలో పాల్గొన్న అధికారులు, చిన్నారులు

దామరగిద్ద: చిన్నారుల ఎదుగుదలపై అవగాహన కల్గి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రూపలత, సర్పంచ్ వెంకటప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దెల్‌బీడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వేశాధారణలతో చిన్నారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రథమ్ సూపర్‌వైజర్ కవిత, మాజీ ఎంపీటీసీ గోపాల్ అంగన్‌వాడీ టీచర్‌లు భారతి, అలవేలుమంగ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి గ్రామంలో శుక్రవారం బీరప్ప ఉత్సవాలు ప్రారంభించారు. గ్రామ శివారులో జమ్ములమ్మ ఆలయం దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. 4 రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం బీరప్ప బండారు కార్యక్రమం నిర్వహించనున్నారు. సర్పంచ్ మాణిక్యమ్మ, నిర్వాహకులు రామలింగప్ప, పెద్దబాలలింగప్ప, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



ఊట్కూరు: మాదాసీ కుర్వ, మాదారి కుర్వ కులస్తులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు అందించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాబ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా దోబీ ఘాట్


ప్రభుత్వాస్పత్రి వెనుక ఏర్పాటు చేసిన దోబీ ఘాట్

ధన్వాడ: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వెనుక నిర్మించిన దోబీఘాట్ అలంకారప్రాయంగా మారుతోంది. రజకులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయించిన ఘాట్ శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఎవరూ వినియోగించకపోవడంతో ప్రజాధనం వృథా అయ్యిందని పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రామంలో రజకులకు మౌలిక సదుపాయాల కల్పించడంలో భాగంగా 2002లో సుమారు రూ.5 లక్షలతో దోబీఘాట్ నిర్మించారు. అదేవిధంగా గది, నీటి సదుపాయం ఇతర సౌకర్యాలు కల్పించారు. కానీ ఎవరూ వినియోగించడం లేదు. దీంతో అదికాస్తా శిథిలావస్థకు చేరుకుంది. ఇదిలా ఉంటే ఘాట్‌వద్ద రజకుల కోసం ఏర్పాటు చేసిన గదిని ఇతరులకు అద్దెకిచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి ఘాట్ వద్ద అవసరమైన మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అమరచింత: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లో ఇంగ్లిష్ పదాల నైపుణ్యంపై శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అమరచింతకు చెందిన జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారని పాఠశాల హెచ్ఎం బలరాముడు తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో పదో తరగతి చదువుతున్న ఎస్.స్నేహ మొదటి బహుమతిని సాధించి రూ.పది వేల నగదు బహుమతిని నాగర్‌కర్నూల్ ఎస్పీ మనోహర్ చేతుల మీదుగా అందుకుందని తెలిపారు. అదేవిధంగా తెలుగు మీడియంలో పదో తరగతి చదువుతున్న వి.స్నేహ రెండో బహుమతి సాధించి రూ.4వేల నగదు బహుమతిని గెలుచుకుంది. జూనియర్ విభాగంలో మండలంలోని కొంకన్‌వానిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న శ్రీనాథ్ మొదటి బహుమతిని సాధించి రూ.4వేల నగదు బహుమతిని పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య విజ్ఞాన సదస్సు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సత్యనారాయణస్వామి దేవాలయంలో శుక్రవారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సునంద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ దీపిక శెట్టి, ప్రసాదొట్టిలు ముఖ్య అతిథులుగా హాజరై ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో నర్సింగ్, అర్షద్, జమీర్‌పాషా, చింతలయ్య, వెంకట్రాములు, ఖాసీం, నారాయణ, నాగమణి, సబిత పాల్గొన్నారు.